
సాక్షి
ఒడిశా

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,99,789లు, బంగారం 11 గ్రాముల 300 మిల్లీగ్రాములు వెండి 27గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



26 నుంచి ఉత్సవాలు

డిసెంబర్ 26 నుంచి చైతీ ఉత్సవాలు జరగనున్నాయి. కసరత్తు చేస్తున్నారు.

- 8లో.



ఐదెకరాల్లో గంజాయి ధ్వంసం

బలిమెల పోలీసులు గంజాయి తోటను ధ్వంసం చేశారు. పంటనంతా కాల్చేశారు.

- 8లో.

న్యూస్‌రీల్

దేవదత్త.. స్ఫూర్తి ప్రదాత



దేవదత్త పాత్రో (ఫైల్)

కొరాపుట్: తాను చనిపోతూ మరో పది మంది బతుకుల్లో వెలుగులు నింపాడో యువకుడు.

కొరాపుట్ జిల్లా కేంద్రంలోని గౌతం నగర్ 4వ లైన్‌కి చెందిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి ప్రతిప్ పాత్రో, సుప్రభా నాయక్ రెండో కుమారుడు దేవదత్త పాత్రో (29) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. విధి నిర్వహణలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. వెంటనే సహచరులు మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే బెంగళూరు వెళ్లారు. కానీ దేవదత్త బతకడని, బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు ప్రకటించారు. ఇదే సమయంలో అవయవదానం కోసం వైద్యులు తల్లిదండ్రుల వద్ద ప్రస్తావించగా.. వారు అంత బాధలోనూ ఒప్పుకున్నారు. దీంతో వెంటవెంటనే రెండు కళ్లు, రెండు కిడ్నీలు, గుండె, లివర్, చర్మం తీసి పలు ఆస్పత్రులకు తరలించారు.

రాష్ట్ర మహిళా కమిషన్ రద్దు

- హై కోర్టులో వ్యాజ్యం దాఖలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర మహిళా కమిషను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో మహిళా కమిషను అధ్యక్షురాలు ఇతర సభ్యుల్ని తొలగించింది. ఈ చర్యని సవాలు చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో వ్యాజ్యం దాఖలైంది. ప్రాథమిక విచారణ చేపట్టిన ధర్మాసనం వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబరు నెల 11వ తేదీకి న్యాయ స్థానం వాయిదా వేసింది. ఈలోగా మహిళా కమిషన్‌కు ఎలాంటి నియామకాలు చేపట్టరాదని రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత న్యాయ స్థానం తెలియజేసింది. మహిళా కమిషను కార్యాచరణ సంతృప్తికరంగా లేనట్లు భావిస్తే సంబంధిత కార్యాచరణ పరిశీలన పత్రాల్ని ధర్మాసనానికి దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి జారీ చేసిన తాఖీదుల్లో స్పష్టం చేయడం విశేషం. కమిషను రద్దుకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్ని సవాలు చేసి ముగ్గురు హై కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. వీరిలో బిజయ్ బరువా, స్వర్ణలత సామల్ మరియు బబిత స్వాంయి ఉన్నారు.

దోమ తెరల పంపిణీ



దోమ తెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: మలేరియా, డెంగీ నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా సదరు సమితి జిమిడిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలోని బాయిసింగి గ్రామంలో దోమ తెరల పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. కార్యక్రమంలో బీడీవో అమూల్య కుమార్ సాహు, పీహెచ్‌సీ అదనపు ఆరోగ్య శాఖ అధికారి భోగి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిద్రించే సమయంలో దోమ తెరలు వినియోగించాలని డాక్టర్ సంతోష్ కుమార్ సూచించారు. కొన్ని ప్రాంతాల్లో అవగాహన రాహిత్యంతో దోమ తెరలను ఇతరత్ర పనులకు దుర్వినియోగం చేస్తుండటం సరికాదన్నారు.

రాష్ట్రంలో మహిళా న్యాయస్థానం: మంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయనున్నట్లు న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో మహిళలు, యువతులు, బాలికలపై అత్యాచారాలు వంటి నేరాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బాధిత వర్గాలకు సత్వర న్యాయం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళా న్యాయ స్థానం ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తోంది. మహిళలపై జరుగుతున్న నేర సంబంధిత కేసుల్ని ఈ న్యాయస్థానం పర్యవేక్షిస్తుందని మంత్రి వివరించారు.

అంతా మహిళలే

మహిళా న్యాయ స్థానంలో న్యాయమూర్తి, ప్రభుత్వ న్యాయవాదులు, సిబ్బంది అంతా మహిళలే ఉంటారని మంత్రి ప్రకటించారు. ఫాస్టుటాక్ కోర్టు తరహాలో మహిళా న్యాయ స్థానం సేవలు అందిస్తుంది. బాధిత మహిళా వర్గాలకు సత్వర న్యాయం కల్పించేందుకు త్వరిత గతిలో కేసుల విచారణ ముగిస్తుంది. దీంతో నిందితులకు సకాలంలో శిక్షలు ఖరారు చేయడం సాధ్యం అవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

చట్టపరమైన సంప్రదింపులు

రాష్ట్రంలో ప్రత్యేక మహిళా న్యాయ స్థానం ఏర్పాటు పురస్కరించుకుని చట్టపరమైన సంప్రదింపులు చురుకుగా సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హై కోర్టుతో సంప్రదింపులు చేస్తుంది. మహిళా న్యాయస్థానం ఏర్పాటు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి.

ధర్మశాలలో ఉద్రిక్తత



విరజా ప్రాజెక్టు తరలింపునకు వ్యతిరేకంగా వీధికి ఎక్కిన ఆందోళనకారులు

- సిట్టింగ్ ఎమ్మెల్యేపై దాడి
- మాజీ ఎమ్మెల్యే వర్గీయుల వ్యూహం
- గట్టి పోలీసు నిఘా

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా ధర్మశాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ నియోజక వర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, భారతీయ జనత పార్టీ నాయకుడు హిమాంశు సాహు (లిక్కు)పై బుధవారం దాడి జరిగింది. విపక్ష బిజూ జనతా దళ్ వర్గీయులు, ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్ (బాబీ) సోదరుడు తన అనుచరులతో పాల్పడినట్లు ఆరోపణ. స్థానిక పోలీసులు రంగంలోకి దిగి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వివరాలు వెల్లడించేందుకు పోలీసు వర్గాలు నిరాకరించాయి.

ఈ సంఘటన పూర్వాపరాలపై నిగ్గు తేల్చేందుకు పోలీసు విభాగం 3 ప్రత్యేక బృందాల్ని నియమించింది. పోలీసులు పలు చోట్ల నిందితుల కోసం గాలిస్తున్నారు. ఆకస్మిక అవాంఛనీయ దాడుల నివారణ నేపథ్యంలో ధర్మశాల టౌన్ పోలీసు ఠాణా ఆవరణలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం శాంతి భద్రతల విభాగం అదనపు డైరెక్టరు జనరల్ సంజయ కుమార్ జాజ్‌పూర్‌లో డేరా వేశారు. ప్రత్యేకంగా సమస్యాత్మక జాజ్‌పూర్ సదరు, జాజ్‌పూర్ టౌన్ పోలీసు ఠాణాలకు ప్రత్యేక భద్రత కల్పించారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో కొనసాగుతుందని ఏడీజీ సంజయ్ కుమార్ తెలిపారు. ధర్మశాల నియోజక వర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే హిమాంశు సాహుపై జాజ్‌పూర్ బుడాఘాట్ ప్రాంతంలో బుధవారం దాడి జరిగింది. ఇదంతా విపక్ష బిజూ జనతా దళ్ వ్యూహమని ప్రభావిత ఎమ్మెల్యే బాహాటంగా ఆరోపించారు. విపక్షం వ్యూహం బెడిసి కొట్టడంతో తనకు ప్రాణాలు దక్కాయి. తనను హత మార్చి త్వరలో ఉప ఎన్నిక నిర్వహణ కోసం ఈ వ్యూహం రచించి దాడికి పాల్పడ్డారని ధర్మశాల నియోజక వర్గం ఎమ్మెల్యే హిమాంశు సాహు ఆరోపించారు. దాడి జరిగిన కాసేపటి తర్వాత మాజీ ఎమ్మెల్యే బబీ దాస్ సోదరుడు లల్లా దాస్ ఫోను చేసి 'అయిపోంది ఏదో అయిపోయింది.. సర్దుకు పోదాం' అని ఫోన్ చేయడం విపక్ష కుట్రగా స్పష్టం చేస్తుందని ఆయన వివరించారు. దాడిలో ఎమ్మెల్యే వ్యక్తిగత అంగ రక్షకుడు (పీఎస్ఓ) నుంచి తుపాకీ బలవంతంగా లాక్కునేందుకు ఆగంతకులు విఫలయత్నం చేశారు. తుపాకీ చిక్కి ఉంటే ప్రాణాలు తీసేసి ఉండే వారని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిలో తన కారు దెబ్బతిందని వివరించారు. బిజూ జనతా దళ్ అహింసావాదంపై విశ్వాసంతో మనుగడ కొనసాగిస్తుందని, హింసకు పాల్పడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్ ప్రకటించారు. బాధిత ఎమ్మెల్యే ఆరోపణ తేవడంతో తక్షణమే తన సోదరునికి పోలీసు ఠాణాకు పంపించి ఆరోపణ వాస్తవాస్తవాలు తేలేంత వరకు అక్కడనే ఉండమని ప్రోత్సహించి పంపినట్లు పేర్కొన్నారు. పోలీసులు ఈ విషయంలో నిష్పక్షపాతంగా పారదర్శకతతో విచారణ చేపట్టి నిజమైన నిందితుల్ని వెలుగులోకి తేవాలని ఆయన అభ్యర్థించారు. దాడికి పాల్పడిన వారి వ్యతిరేకంగా తగిన చర్యలు చేపట్టడంలో తన వంతు పూర్తి సహకారం అందజేస్తానని చెప్పారు. గత బిజూ జనతా దళ్ సంకల్పించిన పలు ప్రాజెక్టుల్ని ఈ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దారి మళ్లించి ప్రజల్ని బురిడీ కొట్టిస్తుందనే ఆరోపణతో స్థానిక అధికార, విపక్ష వర్గాల మధ్య గత కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతోంది. ఇంతలో విరజా ప్రాజెక్టు స్థాన మార్పు వివాదంతో ఆందోళనకు దిగిన వర్గీయులు ఎమ్మెల్యే వాహనంపై దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు.

ఎమ్మెల్యేపై దాడి: 10 మంది నిందితుల అరెస్టు

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా ధర్మశాల నియోజక వర్గం ఎమ్మెల్యే హిమాంశు శేఖర్ సాహుపై దాడి కేసులో గురువారం 10 మంది నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. వీరందర్ని జాజ్‌పూర్ సబ్ డివిజనల్ జుడిషియల్ మేజిస్ట్రేటు (ఎస్‌డీజేఎం) న్యాయ స్థానంలో ప్రవేశ పెట్టారు. వీరి అభ్యర్థన మేరకు బెయిలు మంజూరు చేసేందుకు న్యాయ స్థానం నిరాకరించడంతో జైలుకు తరలించారు. ఈ దాడిలో మిగిలిన నిందితుల కోసం పోలీసుల గాలింపు కొనసాగుతుంది. సుమారు 15 మంది వ్యక్తులు ఎమ్మెల్యే, అతని వ్యక్తిగత అంగ రక్షకునిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణ.



జాజ్‌పూర్ పోలీసు ఠాణాకు ప్రత్యేక భద్రత



హిమాంశు శేఖర సాహు, ధర్మశాల ఎమ్మెల్యే

• అడవిలో అలజడి



సంఘటన స్థలంలో దొరికిన సామగ్రి







మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి గోరకాపల్లి పంచాయతీ జినెల్‌గూఢ అడవిలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందారు. ఒక జవాను గాయపడ్డాడు. మరో ఇద్దరు మావోలు పోలీసుల చేతికి చిక్కారు. బుధవారం రాత్రి నుంచి సాగిన ఈ కాల్పుల తర్వాత ఆ ప్రాంతమంతా భీతావహంగా కనిపించింది.

–మల్కన్‌గిరి

మౌలిక సదుపాయాలు కల్పించరూ..?



గుంజాపాయి గ్రామం



తాగునీటికి అవస్థలు పడుతున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి మునిఖాల్ పంచాయతీ పరిధి గుంజాపాయి గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. నియమగిరి పర్వత ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో 30 డొంగిరియా తెగకు చెందిన కుటుంబాలు నివసిస్తున్నారు. సుమారు 150 మంది జనాభా ఉన్న ఈ గ్రామానికి ఇప్పటికీ సరైన రహదారి లేకపోవడంతో పాటు విద్యుత్, తాగునీటి సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. డొంగిరియా తెగ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డొంగిరియా కొంధొ డవలప్‌మెంట్ ఏజెన్సీ(డీకేడీఏ) సంస్థకు ప్రతీ ఏడాది డొంగిరియా గ్రామాల అభివృద్ధికి కొట్లాది రుపాయల నిధులు మంజూరవుతున్నా, ఇప్పటికీ ఇటువంటి అభివృద్ధి జాడలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయనే చెప్పవచ్చు. సమితి కేంద్రానికి కేవలం 11 కిలో మీటర్ల దూరంలో ఈ గ్రామంలో అధికారులు ఇంతవరకు కాలుపెట్టిన దాఖలాలు లేవనే చెప్పాలి. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వాగులో నుంచి వస్తున్న నీరే వీరికి శరణ్యమవుతోంది. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలని ఆందోళన నేడు

రాయగడ:

జిల్లాలోని మునిగుడ ప్రధాన రహదారి వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు మూడు కూడళ్ల వద్ద భూతల రహదారిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మునిగుడ ప్రగతి మంచ్ ఆందోళన చేపట్టనుంది. నిత్యం రద్దీ ఉండే ఈ ప్రాంతంలో తరచూ రైల్వే ట్రాక్ వద్ద గేటు వేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ఈ సమస్యను నివారించే విధంగా సంబంధిత శాఖ అధికారులకు భూతల రహదారిని ఏర్పాటు చేయాల్సిందిగా పలుమార్లు స్థానికులు విన్నవించుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం నుంచి ఈ ప్రాంతంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రగతి మంచ్ అధ్యక్షుడు సీహెచ్ గణేశ్వరరావు, కార్యదర్శి సింహాచల్ పండాలు తెలిపారు. బుధవారం సాయంత్రం ఈ మేరకు నిర్వహించిన ఒక సమావేశంలో మునిగుడ ప్రగతి మంచ్‌కు చెందిన ప్రతినిధులు, సభ్యులు పాల్గొని ఆందోళన చేపట్టేందుకు తీర్మానించామని వివరించారు. ప్రగతి మంచ్ తరుపున చేపట్టనున్న ఈ ఆందోళనలో భాగంగా శుక్రవారం ఉదయం జగన్నాథ మందిరం నుంచి ర్యాలీగా రైల్వేస్టేషన్ వరకు చేరుకుంటామని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ప్రగతి మంచ్ సభ్యులు

అగ్ని ప్రమాదంలో వ్యాన్ దగ్ధం



అగ్నికి ఆహుతైన వ్యాన్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి రత్నకండి గుడ పంచాయతీ డెఫాగుడ గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో వ్యాన్ దగ్ధమైంది. గడ్డి తీసుకుని వెళ్లడానికి ఆసి దివాన్ అనే డ్రైవర్ వ్యాన్ తెచ్చి గడ్డి వద్ద ఉంచాడు. అనుకోకుండా అగ్గి రాజుకోవడంతో గడ్డితోపాటు వాహనం దగ్ధమైపోయింది. స్థానికులు అగ్గి ఆపడానికి ప్రయత్నం చేసి విఫలం అయ్యారు. ఉమ్మర్‌కోట్, జొరిగాం అగ్ని మాపక బృదాలు వచ్చి మంటలు అదుపులోకి తెచ్చాయి.

బీజేపీ సమావేశం రసాభాస



మాట్లాడుతున్న గొమాంగో, పక్కనే కొరా, పట్నాయక్, నాయక్ తదితరులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ ఐబీ సమావేశ మందిరంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ అధ్యక్షతన ఆ పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో కార్యకర్తలు నాయకులపై విరుచుకు పడడంతో సమావేశం సగంలోనే ముగిసిపోయింది. సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర శాఖ కార్యదర్శి సరోజ్ కర్, పూర్ణిమ నాయక్‌లు కార్యకర్తలను బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినా అసభ్య పదజాలంతో కార్యర్తలు ఆ పార్టీ సీనియర్ నాయకులపై విరుచుకుపడ్డారు. జిల్లాలోని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభల్లో పార్టీ పరాజయానికి పార్టీ నాయకులే కారణమని కార్యకర్తలు దుమ్మెత్తిపోశారు. వ్యక్తిగత స్వార్థాల కారణంగా పార్టీ జిల్లాలో అధోగతిపాలయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలను చిన్నచూపు చూడడంతోనే గత ఎన్నికల్లో పార్టీకి ఇక్కడ చేదు అనుభవం ఎదురయ్యిందని దుయ్యబట్టారు. గుణుపూర్ శాసనసభ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నాయకుడు త్రినాథ్ గొమాంగో ఇదే తరహా పార్టీలో కొనసాగితే పార్టీ మనుగడ పూర్తిగా కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తిగత స్వార్థాలకు తావివ్వకండి


పార్టీ కార్యకర్తలతో సమావేశమైన రాష్ట్ర శాఖ కార్యదర్శి సరోజ్ కొరా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లకు రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన బీజేపీపై ప్రజలకు ఎంతో నమ్మకం కుదిరిందన్నారు. ఆ నమ్మకాలను స్వప్రయోజనాల కోసం వమ్ము చేయకూడదని స్పష్టం చేశారు. అందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని హితవుపలికారు. పార్టీలో వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా పనిచేయాలని సూచించారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం




ప్రపంచ మత్స్యదినోత్సవ సభకు హాజరైన అతిథులు


పర్లాకిమిడి: గజపతి జిల్లాలో చేపలపెంపకం దార్లకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని, ముఖ్యమంత్రి కల్యాణ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ జ్యోతిని వెలిగించి మత్స్య దినోత్సవాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు జిల్లా ముఖ్య ప్రాణిచికిత్స అధికారి డాక్టర్ తుషార్ రంజన్ సాహు, జిల్లా ముఖ్యవ్యవసాయ అధికారి రామ్ ప్రసాద్ పాత్రో, జిల్లా ఉద్యానవనాల డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్ దాస్, సెంచూరియన్ వర్సిటీ ఫిషరీస్ శాఖ అసిస్టెంటు డీన్ సంబిత్ స్వయిని, లీడ్ బ్యాంకు మ్యానేజరు మహేశ్వర మండళ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. జిల్లాలో గుమ్మా, కాశీనగర్, మోహనా, గుసాని ప్రాంతాల్లో అనేక పంచాయతీల్లో చేపల పెంపకంతో పాటు చెరువు గట్లపై నాటుకోళ్ల ఫార్మ్‌లు కూడా పెంచుతున్నారని, ఇది చాలా లాభదాయకమైన సమీకృత వ్యవసాయ విధానమని కలెక్టర్ దాస్ అన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి లిసా బెహరా మాట్లాడుతూ, జిల్లాలో అనేక మంది మహిళా గ్రూపులు చేపల పెంపకం ద్వారా జీవనోపాధిని పెంపొందించుకుంటున్నారని అన్నారు. మోహన బ్లాక్ హారభంగి డ్యామ్ వద్ద జూన్ నుంచి సెప్టెంబరు వరకూ చేపపిల్లల బ్రీడ్ తయారవుతుందని అన్నారు.ఐదేళ్లు చేపల పెంపకం సక్రమంగా జరిపితే వారికి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని జిల్లా మత్స్య అధికారి బెహెరా అన్నారు. పీఎం మత్స్య యోజన పథకంలో కూడా మహిళా గ్రూపులకు ఐస్‌బాక్స్‌లు, వలలు, ఆటోలు సబ్సిడీపై అందజేస్తామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నువాగడ బ్లాక్ శోభాని మండళ్, గుమ్మా, రాయగడ బ్లాక్ మహిళా గ్రూపులకు మెమొంటోలు అందజేసి సత్కరించారు.



మాభవానీ స్వయంసహాయక గ్రూపునకు మెమొంటోను అందిస్తున్న కలెక్టర్ బిజయకుమార్



సమావేశానికి విచ్చేసిన జిల్లాలోని మత్స్యకార రైతులు



మత్స్యదినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్ దాస్

క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణదారుల కట్టడాలను అధికారులు తొలగించారు. ఎంతో కాలంగా ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అందువలన అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఎట్టకేలకు గురువారం కోట్‌పాడ్ తహసీల్దార్ కీర్తిచరణ్ ప్రధాన్, బీడీవో విక్రమ కుమార్ దొర, పోలీసు అధికారి ప్రభారీ సునాని, అదనపు తహసీల్దార్ నీలంబర పూజారి తదితరులు ఒక టీమ్‌గా ఏర్పాటై, ఒక ప్లాటూన్ పోలీసు ఫోర్స్ సాయంతో ఆక్రమణలు తొలగించారు.

జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవాలు



యువరాజపురంలో జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవ ర్యాలీ

పర్లాకిమిడి: జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవం సందర్భంగా గుసాని సమితి యువరాజపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు చైతన్యర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీలో అనేక మంది బాలింతలు, శిశువులు పాల్గొన్నారు. ర్యాలీని బాగుసల మెడికల్ ఆయుష్ డాక్టర్ రజత్ కుమార్ శెఠి, గురండి సీహెచ్‌సీ ప్రజా ఆరోగ్య విస్తరణాధికారి మమతా పాఢి, ఏఎన్ఎం సస్మితా రవుతో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నవజాత శిశువుల సంరక్షణకు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రజత్‌కుమార్ సెఠి వివరించారు.

తిరుపతి పాణిగ్రహికి ఒడిశా రత్న అవార్డు



తిరుపతి పాణిగ్రాహికి అవార్డు అందజేస్తున్న బిశ్వభూషణ్ హరిచందన్

పర్లాకిమిడి: నవ ఉత్కళ నిర్మాత, ఉత్కళకేసరి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ హరేకృష్ణ మహతాబ్ (1946–50) జయంతి ఉత్సవంలో పర్లాకిమిడికి చెందిన హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహిని ఒడిశా రత్న బిరుదుతో ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నరు బిశ్వభూషణ్ హరిచందన్ భువనేశ్వర్‌లో గురువారం అందించారు. పి.ఎం.జి చౌక్ వద్ద జరిగిన డాక్టర్ హరేకృష్ణ మహతాబ్ జయంతి కమిటీ నిర్వహించిన ఈ ఉత్సవ సభకు జట్నీ ఎమ్మెల్యే మన్మథ రౌత్రాయ్, మాజీ స్పీకర్ సురేష్ రౌత్రాయ్ హాజరయ్యారు. ముఖ్యంగా గజపతి జిల్లాలోని ఆదివాసీ ప్రజలకు ఉచితంగా హైటెక్ ఆస్పత్రిలో వైద్యం అందజేయడమే కాకుండా, కోవిడ్ మహమ్మారి సమయంలో అనేక నగరాల్లో కోవిడ్ ఆస్పత్రులు నిర్మించి ప్రజలకు సేవ చేశారని మాజీ ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ అన్నారు. ఈ అవార్డు తనకు గురుతర బాధ్యత తెలియజేసిందని ఈ సందర్భంగా తిరుపతి పాణిగ్రాహి అన్నారు.

'సామాజిక న్యాయం కల్పించడంలో ప్రభుత్వం విఫలం'

భువనేశ్వర్: రాష్ట్రంలో బాలికలు, దళితులు, మహిళలపట్ల అత్యాచారాలు నిత్య కృత్యాలుగా పరిణమించాయని. సగటు పౌరునికి సామాజిక న్యాయం కల్పించడంలో రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఘోరంగా విఫలమైందని బిజూ జనతా దళ్ ఆరోపించింది. స్థానిక శంఖ భవన్‌లో గురు వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధికార ప్రతినిధి లేఖశ్రీ సామంత సింగార్ మరియు బీజేడీ ఎమ్మెల్యే కలికేష్ నారాయణ సింగ్‌దేవ్ మాట్లాడారు. నవీన్ పట్నాయక్ పటిష్టపరిచిన సామాజిక న్యాయ వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బొలంగీరులో శిశువుల అమ్మకం, మహిళల పట్ల అత్యాచారాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయని అన్నారు. ఇటీవల ఖొప్రాఖోల్ ప్రాంతంలో శిశువు అమ్మకం కలకలం రేపిందన్నారు. ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ నియోజక వర్గంలో ఇటువంటి విచారకర సంఘటన తలెత్తడం విచారకరమని అన్నారు.

పేపర్ మిల్లు కార్మికుల ఆందోళన

జయపురం: జయపురం సేవా పేపరు మిల్లు కార్మికులు ఆల్‌ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకుల నేతృత్వంలో గురువారం బరంపురం పీఎఫ్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

వీగిన అవిశ్వాస తీర్మానం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్‌పై కొన్ని నెలల కిందట గుమ్మా సమితి సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. బుధవారం గుమ్మా సమితి సర్వసభ్య సమావేశంలో ఆమెపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ముగ్గురు సభ్యుల గైర్హాజరుతో వీగిపోయింది. ఇకపై గుమ్మా సమితి అధ్యక్షురాలిగా సునేమీ మండల్ కొనసాగవచ్చని జిల్లా పంచాయతీ అధికారి ప్రకటించారు.

డిసెంబర్ 26 నుంచి చైతీ ఉత్సవాలు

- రాయగడ కలెక్టర్ ఫరూల్ పట్వారీ వెల్లడి



వేదికపై ప్రసంగిస్తున్న కలెక్టర్ పట్వారీ



సమావేశంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

రాయగడ: ఈ ఏడాది డిసెంబర్ 26వ తేదీ నుంచి చైతీ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఫరూల్ పట్వారీ ప్రకటించారు. స్థానిక మున్సిపాలిటీ బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఉత్సవాల నిర్వహణ సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఉత్సవాలకు స్థానిక గాంధీపార్క్ సమీపంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానం వేదికగా ఖరారైనట్లు పేర్కొన్నారు. గతేడాది చైతీ ఉత్సవాలకు సుమారు రూ.92 లక్షలు వెచ్చించడం జరిగిందని వివరించారు. అందుకు సంబంధించి పూర్తి వివరాలు కావాల్సిన వారు జిల్లా సాంస్కృతిక అధికారిని సంప్రదించవచ్చన్నారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహక సమావేశంలో నిర్ణయించారు.

మొరిచొగుడలో ఉత్సవాలకు శ్రీకారం

చైతీ ఉత్సవాలను 5 రోజుల పాటు నిర్వహించేందుకు తీర్మానించడంతో పాటు ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా సమితి స్థాయిలో కూడా ఈ ఉత్సవాలను ఒక్కరోజు నిర్వహించేందుకు కలెక్టర్ పట్వారీ అందరి అభిప్రాయాన్ని సేకరించారు. జిల్లాలోని పద్మపూర్ సమితి మొరిచొగుడలోని అక్షరబ్రహ్మ మందిరం నుంచి డిసెంబరు మొదటి వారంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. గతేడాది కల్యాణ సింగుపూర్ నుంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా ఈ ఏడాది వికాస్ మేళా–24 పేరిట ఈ చైతీ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. దీనికోసం త్వరలో నిర్వాహక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగోలు మాట్లాడుతూ ఆదివాసీల భాష, సంస్కృతికి అద్దంపట్టే ఈ చైతీ ఉత్సవాలు, వారి అభివృద్ధికి పునాదులని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, గుణుపూర్ సబ్ కలెక్టర్ ప్రతీకార్ సహూట తదితరులు పాల్గొన్నారు.

హరే కృష్ణ మెహతాబ్ స్మారక పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ



హరే కృష్ణ మెహతాబ్ స్మారక పోస్టల్ స్టాంపు ఆవిష్కరించిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్:

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఉత్కళ కేశరి డాక్టరు హరే కృష్ణ మెహతాబ్ 125వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని స్మారక పోస్టల్ స్టాంపు ఆవిష్కరించారు. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ ఉత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ స్టాంపు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కటక్ లోక్ సభ సభ్యుడు, దివంగత ముఖ్యమంత్రి హరే కృష్ణ మెహతాబ్ తనయుడు భర్తృహరి మెహతాబ్ హాజరయ్యారు. హరే కృష్ణ మెహతాబ్ రాష్ట్ర చారిత్రాత్మక నాయకుల్లో అగ్ర శ్రేణి నాయకునిగా గుర్తింపు సాధించారు.

ఏడాది పొడవునా జయంత్యుత్సవాలు

డాక్టరు హరే కృష్ణ మెహతాబ్ 1899 సంవత్సరం నవంబరు నెల 21వ తేదీన భద్రక్ జిల్లా ఒగొరొపొడా గ్రామంలో జన్మించారు. ఆయన 125వ జయంత్యుత్సవాల్ని సుదీర్ఘంగా ఏడాది పాటు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సాంస్కృతిక శాఖ 23 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటి ఏర్పాటు చేసింది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉత్కళ కేశరి హరే కృష్ణ మెహతాబ్ జీవిత చరిత్ర చిత్రంగా ఆవిష్కరించి పాఠశాలల్లో ప్రదర్శించి విద్యార్థుల్లో చరిత్రకారుల పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తారు. దివంగత ముఖ్యమంత్రి జన్మ స్థలంలో విగ్రహం ప్రతిష్ఠించి పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు సంకల్పించారు.

ట్రక్కు దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన మొక్కజొన్న ట్రక్కు



బస్తాలను వ్యాపారులకు చేరవేసేందుకు వినియోగించిన మరో ట్రక్కు



పట్టుబడిన నిందితుడు డ్రైవర్ బలరాం కోశ్ల



పోలీసులకు పట్టుబడిన నిందితుడు రఘునాథ్ జాని

జయపురం: మొక్కజొన్న గింజల లోడు ట్రక్కును దొంగిలించిన కేసులో ఇద్దరు దుండగులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు ఇన్‌చార్జి పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి గురువారం వెల్లడించారు. అరెస్టయిన వారు జయపురం సమితి ఉమ్మిరి గ్రామ పంచాయతీ రత్నాకరగుడలో ట్రక్కు డ్రైవర్ బలరాం కోశ్ల(37) బొరిగుమ్మ సమితి సోలారుట్ రఘునాథ్ జానీ ఉరఫ్ రాజు(26) అని వెల్లడించారు. అధికారి వివరణ ప్రకారం.. ఈ నెల 17న బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధి ముండిగుడ ప్రాంతంలో మొక్కజొన్న గింజల బస్తాలు లోడు చేసిన ట్రక్కు డ్రైవర్ అర్జున భొత్ర తన ఇంటి పనుల్లో బిజీగా ఉండటం వల్ల ట్రక్కు యజమాని బలరాం ఖొరను ఆ ట్రక్కు డ్రైవర్‌గా పంపారు. అయితే రాత్రి 7 గంటలైనా ఆ ట్రక్కు గమ్యం చేరలేదు. ట్రక్కు ఎక్కడ ఉన్నదీ ట్రక్కు యజమాని తెలుసు కొనేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు . ట్రక్కు జాడ తెలియక పోవటంతో యజమాని కలసహండి గ్రామం ప్రకాశ పూజారి ఈ నెల 18 వ తేదీన జయపురం సదర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ బలరాం 300 బస్తాల మొక్క జొన్న బస్తాలు గల ట్రక్కుతో పరారైనట్లు స్పష్టమైంది. వాటి విలువ రూ.4 లక్షలు ఉంటుందని అంచనా. బలరాం ముందుగా రఘునాథ్ జానీతో కలసి వేసుకున్న పథకం ప్రకారం మొక్క జొన్న బస్తాలు దొంగిలించాలని ట్రక్కుతో పరయ్యారు. పలువురు వ్యాపారులకు కొన్ని మొక్క జొన్న బస్తాలు అమ్మారు. మొక్కజొన్న బస్తాలు వ్యాపారులకు చేరవేసేందుకు మరో ట్రక్కును వినియోగించారు. ఎట్టకేలకు పోలీసులు వారిని అరెస్టు చేసి వారి నుంచి మొక్క జొన్న బస్తాలుగల ట్రక్కుతో పాటు బస్తాలు వ్యాపారులకు చేర్చేందుకు వినియోగించే మరో ట్రక్కును సీజ్ చేశారు. ట్రక్కులో 245 బస్తాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామని కోర్టు వారు బెయిల్ నిరాకరించటంతో నిందితులు జైలుకు తరలించామన్నారు.

3 విశ్వ విద్యాలయాల వీసీల పదవీ కాలం పొడిగింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో 3 ప్రభుత్వ విశ్వ విద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలం పొడిగించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్, చాన్స్‌లరు ఆమోదం లభించింది. మరో 3 ప్రభుత్వ విశ్వ విద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలంపై ఎలాంటి నిర్ణయం ఖరారు కాలేదు. ఈ మేరకు రాజ్ భవన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గంగాధర్ మెహర్ విశ్వ విద్యాలయం, ఉత్కళ విశ్వ విద్యాలయం, రమా దేవి మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలం పొడిగించినట్లు రాజ్ భవన్ జారీ చేసిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం పదవీ కాలం పూర్తయిన రోజు నుంచి మరో 6 నెలలపాటు వీరు వైస్ చాన్స్‌లర్ హోదాలో నిరవధికంగా కొనసాగుతారు. లేదా కొత్త వైస్ చాన్స్‌లరు నియామకం జరిగి బాధ్యతలు స్వీకరించేంత వరకు నిరవధికంగా కొనసాగుతారు. స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సబితా ఆచార్య ఈ నెల 23, రమా దేవి మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసరు అపరాజిత చౌదరి ఈ నెల 25, సంబలపూర్ గంగాధర్ మెహర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసరు నాగరాజ్ ఈ నెల 26న ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంది.

వేసక్టమీపై అవగాహన



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మహదేవ్ మఝి

పర్లాకిమిడి: గురండి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం వేసక్టమీ ఫోర్ట్‌నైట్ చైతన్య ప్రచార రథాన్ని గారబంద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహదేవ్ మఝి ప్రారంభించారు. వేసెక్టమీ ఆపరేషన్‌ను పురుషులు చేయించుకోవడం ద్వారా జన నియంత్రణ పాటించవచ్చని డాక్టర్ మఝి తెలిపారు. ఎక్కువ మంది పిల్లలు కలిగి ఉండ కూడదని నిర్ణయించుకున్న జంటలకు, గర్భనిరోధక బాధ్యతను పంచుకోవాలనే వ్యక్తుల అవగాహనకు ప్రచార రథం ద్వారా చైతన్య కల్పిస్తున్నామని డాక్టర్లు అన్నారు. ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి గారబంద ఆయుష్ డాక్టర్ పూర్ణచంద్ర పాత్రో, ఫార్మాసిస్టు కె.సి.పాణిగ్రాహి, బి.పి.ఎం.ఎం.ఖగేశ్వర్, ప్రజా ఆరోగ్య సంసోదన అధికారి మమతా పాఢి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఐదెకరాల్లో గంజాయి ధ్వంసం

మల్కన్‌గిరి:



గంజాయి మొక్కలు నరుకుతున్న పోలీసులు

మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు గురువారం మజురాలెండి కొండల్లో ఐదెకరాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ నేతృత్వంలో కాల్చివేశారు. ఈ 5 ఎకరాల్లో 7వేలకు పైగా మొక్కలు నరికేశారు. వీటి విలువ రూ.20 లక్షలు వరకు ఉంటుంది. ఎవరు సాగు చేశారో తెలుసుకుని కేసు నమోదు చేస్తామని ఐఐసీ ధీరజ్ తెలిపారు.

కాశీనాథ్ పట్నాయక్ సేవలు చిరస్మరణీయం



.స్మారక సంచికను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అతిథులు

జయపురం: బొరిగుమ్మ సమితి ప్రజలకు, సమితి అభివృద్ధికి స్వర్గీయ కాశీనాథ్ పట్నాయక్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర కొనియాడారు. గురువారం శొశాహండి పంచాయతీ నువాగాం గ్రామంలో నిర్వహించిన కాశీనాథ్ పట్నాయక్ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశీనాథ్ పట్నాయక్ ప్రముఖ సమాజ సేవకుడని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. కాశీనాథ్ పట్నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రచురించిన స్మారక సంచికను విడుదల చేశారు. గౌరవ అతిథిలుగా కొట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర మఝి, రామేశ్వర జెన, జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు మాలతీ మఝి, ముఖ్యవక్తగా అంతర్యామి రథ్, తదితరులు కాశీనాథ్ పట్నాయక్ సేవలను కొనియాడారు. సమితిలోని పలువురు ప్రముఖులతోపాటు కాశీనాథ్ పట్నాయక్ తమ్ముడు భాష్కర పట్నాయక్, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, అతిథులు

జయపురం: బొరిగుమ్మలో గల సరస్వతీ శిశుమందిరం వార్షికోత్సవం సందర్భంగా రెండురోజులపాటు నిర్వహించిన క్రీడా ఉత్సవాలు గురువారం ముగిశాయి. క్రీడా ఉత్సవాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు ప్రఫుల్ల కుమార్ దండసేన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మొత్తం 36 రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 210 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 108 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలచి బహుమతులు పొందారు. ఐదుగురు విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికయ్యారు. ప్రతి పోటీలో ప్రథమ స్థానంలో నిలచిన వారందరినీ త్వరలో జరుగనున్న జిల్లాస్థాయి పోటీలకు పంపనునట్లు నిర్వాహకులు వెల్లడించారు. బొరిగుమ్మ పంచాయతీ సర్పంచ్ తుషార్‌కాంత కుమ్రిక ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.సరస్వతీ శిశుమందిర హెచ్‌ఎం ఆచార్య మమతా మహాపాత్రో పర్యవేక్షణలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రక్కు ఢీకొని మహిళ దుర్మరణం

భువనేశ్వర్: స్థానిక పలాసుణి కూడలి వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకు వచ్చిన ట్రక్కు మహిళని ఢీకొంది. మహిళని ఢీకొన్న ట్రక్కు డ్రైవరు పరారయ్యాడు. ఘటనా స్థలంలో మహిళ దుర్మరణం పాలైంది. ఈ సంఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తూ పలువురి ప్రాణాల్ని పొట్టనబెట్టుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్తు నుంచి స్థానికులకు భద్రత కల్పించేందుకు ఈ ప్రాంతంలో కాలి నడక వంతెన ఎఫ్‌ఓబీ నిర్మించాలనే డిమాండుతో స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో ఈ మార్గంలో వాహనాల రవాణా, సాధారణ ప్రజానీకం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు మంత్రి మండలి సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం ఈ నెల 23 శనివారం జరుగుతుంది. శాసన సభ శీతా కాలం సమావేశాల సందర్భంగా మంత్రి మండలి సమావేశం కానుంది. ఈ సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్న అనుబంధ బడ్జెటు ప్రతిపాదనలు, రూపకల్పనలు ప్రధానాంశంగా మంత్రి మండలి చర్చిస్తుంది. మంత్రి మండలి ఆమోదంతో సభ ఆమోదం కోసం దీనిని శీతా కాలం సమావేశాల్లో ప్రవేశ పెడతారు. ఈ నెల 26వ తేదీ నుంచి శీతా కాలం సమావేశాలు ఆరంభం కానున్నాయి. డిసెంబర్ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి. సమావేశాల తొలి రోజు ఈ నెల 26న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సభలో మంత్రి మండలి ఆమోదిత అనుబంధ బడ్జెటుని సభలో ప్రవేశ పెట్టనున్నారు. డిసెంబరు నెల 5న ఈ బడ్జెట్ ఆమోదం కోసం సభలో చర్చిస్తారు.

కేంద్ర సీఆర్ఎం బృందం పర్యటన



జయపురం జిల్లా కేంద్ర హాస్పిటల్‌ను సందర్శిస్తున్న కేంద్ర సీఆర్ఎం బృందం

జయపురం: కేంద్ర కామన్ రివ్యూ మిషన్ టీమ్ (సీఆర్ఎం) జయపురంలో గురువారం పర్యటించింది. కొరాపుట్ జిల్లా కేంద్ర హాస్పిటల్‌ని సందర్శించింది. హెల్త్ కుటుంబ, కళ్యాణ విభాగ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జయ ఆలీ రిజ్వీ, అడ్వైజర్ డాక్టర్ శశాంక్ కుమార్, కర్ణాటక రాష్ట్ర డాక్టర్ మధుసూదన సాయి, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ దీపా ఎలెన్, ఆర్థిక విశ్లేషణ నిపుణులు సత్యజిత్‌తో కూడిన కేంద్ర సీఆర్ఎం టీమ్ దాదాపు మూడు గంటలు జిల్లా కేంద్ర హాస్పిటల్‌ను సందర్శించారు. హాస్పిటల్‌లో అన్ని విభాగాలు, ఆపరేషన్ యూనిట్, హాస్పిటల్ పరిసర ప్రాంతాలు, నూతన భవనాలు పరిశీలించారు. వీరితో కొరాపుట్ జిల్లా ప్రధాన వైద్యాధికారి (సీడీఎంఓ) డాక్టర్ వరద కుమార్ మిశ్ర, జిల్లా చికిత్సా కేంద్ర అధికారి డాక్టర్ రవీంద్రనాథ్ మిశ్ర, హాస్పిటల్ మేనేజర్ రూపసి నాయక్ తదితరులు హాస్పిటల్‌లో గల సౌకర్యాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. టీమ్ రెండు జట్లుగా ఏర్పడి ఒక జట్టు జిల్లా కేంద్ర హాస్పిటల్‌ను, రెండో జట్టు జయపురం పట్టణంలో గల సబ్‌డివిజన్ హాస్పిటల్, జయపురం సబ్‌డివిజన్‌లో గల కమ్యూనిటీ హాస్పిటల్, ప్రాథమిక వైద్య కేంద్రాలను సందర్శించి వాటి పరిస్థితులపై అధ్యయనం చేశాయి.

ఉత్సాహంగా సర్గిఫుల్ ఫెస్టివల్-2024



వేదికపై అతిథులు




బోండ మహిళ చిత్రం వద్ద విద్యార్థులు

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరిలోని మాల్యవాంత్ వసతి గృహంలో గురువారం జిల్లా స్థాయి సర్గిఫుల్ ఫెస్టివల్-2024 నిర్వహించారు. కార్యక్రమ ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు 25 స్టాళ్లు ఏర్పాటు చేసి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆశిష్ పటేల్, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్, జిల్లా అదనపు ఎస్పీ తపాన్ నారాయణ్ రోతో, జిల్లా విద్యాశాఖ అధికారి విశ్వనాథ్ తదితరులు హాజరయ్యారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అధికారులు



వేదిక వద్ద సైకత చిత్రాలు

క్లుప్తంగా

గిరి ప్రదక్షిణ రహదారి నిర్మాణానికి సర్వే


రామతీర్థం బోడికొండ ప్రాంతంలో పర్యటిస్తున్న పీఆర్ డీఈ శ్రీనివాసరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో నీలాచల పర్వతం చుట్టూ గిరి ప్రదక్షిణకు రహదారి నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. సీతారామునిపేట జంక్షన్ నుంచి బోడికొండ చుట్టూ తారు రోడ్డు నిర్మాణానికి ఇటీవల రూ.2కోట్లు మంజూరయ్యాయి. రహదారి నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి శంకుస్థాపన కూడా చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీనివాసరావు, తన సిబ్బందితో కలిసి కొండ చుట్టూ సర్వే చేపట్టారు. రహదారి నిర్మాణానికి కొలతలు తీసి హద్దులు కేటాయించారు. కార్యక్రమంలో నాయకులు పైడిరాజు, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్‌లో చోరీ


పాన్‌షాపు వద్ద చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్‌లో గల పాన్ షాప్‌లో బుధవారం రాత్రి దొంగతనం జరిగినట్లు షాప్ యజమాని రమేష్‌పాత్రో తెలిపాడు. ఎల్విన్ పేటలో గల ఈ పాన్‌షాప్‌ను గురువారం ఉదయం తెరిచేసరికి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయని, క్యాష్‌బాక్స్‌లో ఉంచిన రూ.48వేల నగదుతో పాటు సుమారు రూ.10వేలు విలువ చేసే వస్తువులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పాడు.

అగ్నికి ఆహుతైన దుకాణం


దగ్ధమవుతున్న దుకాణం

మక్కువ: మండలంలోని నంద గ్రామంలో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వారణాసి వెంకటేష్ కిరాణా దుకాణం దగ్ధమైంది. అగ్నికీలలు ఎగసిపడడంతో దుకాణం పక్కనే ఉన్న గిరిజనుడి పెంకుటిల్లు కొంతమేర కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

24న జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 24న జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని ఫైర్‌చెస్ స్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్ 7, 9,11,13,15 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించే పోటీల్లో అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. పోటీల్లో విజేతగా నిలిచిన వారికి రూ.5వేల ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్95734 15618 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక పూల్‌భాగ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు గురువారం తెలిపారు. డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమీప ప్రాంతంలో మృతునికి సంబంధించిన వివరాల గురించి ఆరాతీశారు. ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చేనెల 2 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి డి.మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం స్వీకరించే దరఖాస్తులతో పాటు ఈ ఏడాది జనవరి నుంచి మార్చినెల వరకు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులను మంజూరు చేయనుందని పేర్కొన్నారు.

పేదల విద్యపై పెట్టుబడి దారుల కుట్ర

- ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాల జీఓ కొట్టివేత
- విధిలేక బడిబయటకు పేద విద్యార్థుల చదువులు
- ఫీజులు ఎలా కట్టాలన్న ఆందోళనలో తల్లిదండ్రులు
- ప్రశ్నార్థకంగా 2,484 మంది విద్యార్థుల భవిష్యత్తు




యు.మాణిక్యం నాయుడు, డీఈఓ విజయనగరం

విజయనగరం అర్బన్: 'మాది రోజుకూలీ కుటుంబం. దాసన్నపేటలో ఉంటున్నాం. విజయనగరంలోని సమీప కార్పొరేట్ పాఠశాలలో ఉచిత సీటు వచ్చిందని గత ఏడాది 1వ తరగతిలో మా అబ్బాయిని జాయిన్ చేశాం. ఇటీవల సుమారు రూ.60 వేల ఫీజు చెల్లించాలని కార్పొరేట్ యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఉచిత సీట్లు రద్దయ్యాయని విధిగా ఫీజులు చెల్లించాలని కొద్దిరోజులుగా తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. అంతంత ఫీజులు చెల్లించడం సాధ్యం కాదని స్కూల్ మాన్పించాం'. ఇది పట్టణంలోని ఒక విద్యార్థి తల్లిదండ్రుల ఆవేదన.

కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలల్లో విద్యను వ్యాపారం చేసి మధ్య తరగతి కుటుంబాల పిల్లలను చదువుకు దూరం చేస్తోంది. కార్పొరేట్/ప్రైవేటు విద్యకు అండగా ఉంటూ పేదల విద్యకు తూట్లు పొడుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు మేలు చేశారు. అన్ని ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించేలా జీఓ నంబర్ 24 జారీ చేశారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. మన రాష్ట్రంలోని విద్యార్థులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించారు. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజులు కూడా ప్రభుత్వం చెల్లించేలా జీఓ జారీ చేశారు.

కుట్ర పన్నిన ప్రైవేట్ కూటమి ప్రభుత్వం

ఇంతలో ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీరావడంతోనే దాడులు, అత్యాచారాలు, హత్యలతో రాష్ట్రం నాలుగు నెలలుగా అట్టుడుకుతూనే ఉంది. దీనికి తోడు ప్రైవేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించడాన్ని ముందు నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఎలాగైనా సరే ఈ భారాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో వారున్నారు. అనుకున్నదే తడవుగా ప్రైవేట్ విద్యాసంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 20 శాతం సీట్లు కేటాయిస్తే మాకు ఎలాంటి ఉపయోగం ఉండదు, వాటి వల్ల ప్రభుత్వం మాకు ఫీజులు కూడా చెల్లించడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని సాకుగా తీసుకున్న కూటమి ప్రభుత్వం హైకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకపోవడంతో జీఓ నంబర్ 24ను కోర్టు కొట్టేసింది. నిజంగా పేద విద్యార్థుల చదువులకు న్యాయం చేయాలనుకుంటే హైకోర్టు ఆదేశాలపై ఉన్నతస్థాయి కోర్టులను కూటమి ప్రభుత్వం ఆశ్రయించేది. కానీ ఇంతవరకు ప్రభుత్వం ఆ ఊసే పట్టనట్లు ఉంది. మరో వైపు కోర్టు ఆదేశాలను చూపించి ప్రైవేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థుల నుంచి ఫీజు వసూలు మొదలు పెట్టాయి. ఉచిత సీటు రద్దయిందని ఫీజు విధిగా చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో వారంతా ఆందోళనలో పడ్డారు. చాలా మంది మధ్యంతరంగా పిల్లల చదువులను ఆపేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా 2,711 మంది భవిష్యత్తు

ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పొందిన విద్యార్థులు 2,711 మంది ఉన్నారు. 2022-23 విద్యాసంవత్సరం నుంచి అమలులో ఉన్న హైకోర్టు జీఓ నంబర్ 24ను కొట్టేయడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. హైకోర్టు తీర్పు తదనంతరం ఎలాంటి ఆదేశాలివ్వని కారణంగా ఉచిత సీట్లు రద్దు అంశం అమలులోకి రాదని, కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఫీజు ఒత్తిడి చేయవద్దు



విద్యాహక్కు చట్టం మేరకు అమలులో ఉన్న జీఓ నంబర్ 24 ఉత్వర్వులపై ఇంకా రద్దు ఆదేశాలు జారీ కాలేదు. అంతవరకు ప్రైవేట్/కార్పొరేట్ స్కూళ్లలో ఈ జీఓ పరిధిలో ప్రవేశాలు జరిగిన విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని యాజమాన్యాలకు ఆదేశాలిచ్చాం. ఫీజు చెల్లింపు ఒత్తిడితో ఎవరూ బడి మధ్యలో మానేయవద్దు. ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలపై ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– ఎన్.తిరుపతినాయుడు, మన్యం డీఈఓ

జిల్లా పోలీసుశాఖలో బదిలీలు

- 17 మంది ఏఎస్సైలు, 59 హెచ్‌సీలు, 137కానిస్టేబుళ్లకు స్థానచలనం


బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తూ, ఐదేళ్లు పూర్తిచేసుకున్న ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌కు ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి, పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పనిచేస్తూ, ఐదేళ్లు పూర్తిచేసిన పోలీసు సిబ్బందిని కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీ చేసేందుకు గాను జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించామని చెప్పారు. బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన పోలీసు సిబ్బంది పుట్టిన తేదీ, సీనియార్టీ ప్రాతిపదికగా లిస్ట్ తయారుచేసి, పోలీసు కార్యాలయంలో కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రదర్శించి బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన వారిని సమావేశమందిరంలో కూర్చోబెట్టి ఒక్కొక్కరిగా ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌ను కౌన్సెలింగ్‌కు పిలిచామన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ఏర్పడిన ఖాళీలను కంప్యూటర్ స్క్రీన్‌మీద ప్రదర్శించి, వారి నుంచి విన్నపాలను స్వీకరించి, వారు కోరుకున్న స్థానానికి పారదర్శకంగా బదిలీలను చేపట్టామని ఎస్పీ వివరించారు. ఈ క్రమంలో 17 మంది ఏఎస్సైలు, 59మంది హెచ్‌సీలు, 137 మంది కానిస్టేబుల్స్‌ను ఎస్పీ వివిధ పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేస్తూ, ఉత్తర్వులు జారీచేశారు. ఎటువంటి సిపార్సులకు తావులేకుండా కింది స్థాయి సిబ్బంది కోరుకున్న స్థానానికి బదిలీలు చేపట్టడంతో పోలీసు సిబ్బంది తమ ఆనందం వ్యక్తం చేశారు. బదిలీల ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఓ పి.శ్రీనివాసరావు, ఆఫీస్ పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, ఎస్పీ సీఐలు ఏవీ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే. చౌదరి, చాముండేశ్వరి, ఇతర పోలీసు అధికారులు, కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు క్రీడల్లో పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలి

- డీఈఓ డా.ఎన్ తిరుపతి నాయుడు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎన్ తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాకు క్రీడల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎన్ తిరుపతి నాయుడు విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు అనంతపురం జిల్లాలో జరగనున్న 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ కరాటే పోటీలకు జిల్లా నుంచి 4గురు బాలురు, 8 మంది బాలికలు ఎంపికవడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో మంచి పతకాలు సంపాందించి జాతీయస్థాయి పోటీలలో ప్రవేశం పొందాలని ఆకాంక్షించారు. జిల్లాకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వర రావు, వ్యాయమ ఉపాధ్యాయులు డీటీ గాంధీ, జి. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు కోచ్‌గా లీలాకృష్ణ


జాతీయఅథ్లెటిక్స్ పోటీలకు కోచ్‌గా ఎంపికైన లీలాకృష్ణ

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్‌గా జిల్లాలోని పూసపాటిరేగ మండలం పసుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న పి.లీలాకృష్ణ నియమితులయ్యారు. ఈనెల 26 వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరగనున్న అండర్- 17 జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌గా లీలాకృష్ణను నామినేట్ చేస్తూ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టుకు కోచ్‌గా ఎంపికైన లీలాకృష్ణకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగేశ్వరరావు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కృష్ణంరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

జాబ్ మేళా రేపు

పార్వతీపురంటౌన్: ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని ఎస్‌వీడీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసాన్ ఎక్స్‌పీరియన్స్‌లో టెలిసేల్స్ రిప్రెజెంటేటివ్, టారుస్ కంపెనీలో బీపీఓ (ఇంగ్లీషు, తెలుగు), నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, అరబిందో ఫార్మాలో కెమిస్ట్, ఇండో ఎంఐఎం, హ్యుండయ్ మోబీస్, ఇన్నిలోమ్ ఇండియా ప్రైలి పానాసోనిక్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్ కంపెనీల్లో టెక్నీషియన్, టాటా కెమికల్స్ లిమిటెడ్‌లో ప్యాకింగ్ అసిస్టెంట్, ఇండన్కాఫీ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెక్నీషియన్, ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బి.టెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వారికి నెలకు రూ.12,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణాసౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందని స్పష్టం చేశారు.

భర్తపై గృహహింస కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధి మారుతీనగర్ 2వ లైన్‌కు చెందిన మహిళ తూతిక జ్యోతి తన భర్త త్రిమూర్తులు కుటుంబాన్ని కనీసం పట్టించుకోవడంలేదని, హింసిస్తున్నాడని గురువారం ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు త్రిమూర్తులుపై గృహహింస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలి


నిరసన దీక్షలకు మద్దతు తెలుపుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

పార్వతీపురంటౌన్: అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉద్యోగభద్రత కల్పించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో చేపట్టిన నిరసన దీక్షకు ఆమె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం దీక్షా శిబిరానికి వెళ్లి మాట్లాడుతూ వారందరిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వారి పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరసాడ రమేష్, సహాయ కార్యదర్శి రాయల వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మురళీమోహన్ రావు, ఉపాధ్యాయులు శ్రీను రమేష్, వెంకట్, మురళి, రవి, జ్యోతి, ఉమ, అప్పారావు, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతికి కారణం..ప్రభుత్వం వైఫల్యమే

- సమగ్ర విచారణ జరిపించాలి
- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురంటౌన్: గిరిజన విద్యార్థుల మృతికి కారణం ప్రభుత్వం వైఫల్యమేనని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. ఈ మేరకు గురువానం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 55 వరకు ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని, రెండు ఐటీడీఏలకు పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల పర్యవేక్షణ కొరవడిందని విమర్శించారు. అధికారుల కొరత, సరిపడా నిధులు మంజూరు కాకపోవడం, అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు ప్రతిసారి జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే సుమారు ఏడుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగా ఉన్న గిరిజన శాఖ మంత్రి ఎటువంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వం వైఫల్యమేనన్నారు. మృతిచెందిన గిరిజన విద్యార్థులకు రూ.15 లక్షలు చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో గిరిజన శాఖ మంత్రి కార్యాలయాన్ని విద్యార్థులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం అన్యాయం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం రైతుల పట్ల చాలా కర్కశంగా వ్యవహరిస్తోందని, రైతుల గోడును టీడీపీ కూటమి ప్రభుత్వం పెడచెవిన పెట్టడం అన్యాయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యం విషయంలో ప్రభుత్వం చాలా కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రైతుకు ఒక ఎకరాకి రూ. 1200 నుంచి రూ.1400 వరకు నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2300కు గాను కేవలం రూ.1800కే కొనుగోలు చేస్తున్నారని, ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వ ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ధాన్యం సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతుల ధాన్యం ఎక్కడ కొనాలో? ఎప్పుడు కొనాలో? ఎటువంటి ప్రణాళిక ప్రభుత్వం దగ్గర లేకపోవడం దురదృష్టకరమన్నారు.

27న ధర్నాలు

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2300లకు మాత్రమే రైతులు ధాన్యం అమ్మాలని అంతకంటే తక్కువ ధరకు రైతులు ఎవరూ అమ్మొద్దని ఆయన సూచించారు. ఈనెల 26 లోపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టకపోతే 27వ తేదీన మండల తహసీల్దార్ కార్యాలయాలు, అలాగే కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలకు రైతులందరూ పండించిన ధాన్యం పంటతో కదలి రావాలని పిలుపునిచ్చారు.

అమ్మో.. డయేరియా..!

- నమోదవుతున్న కొత్తకేసులు
- గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక వైద్య శిబిరం
- ఇంటింటా సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది


సారిపల్లిలో రోగిని తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామస్తులను డయేరియా పట్టిపీడిస్తోంది. నెల రోజుల నుంచి కేసులు ఒక్కొక్కటిగా నమోదవుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సతివాడ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించి సేవలందిస్తున్నా వ్యాధి అదుపులోకి రాకపోవడం వైద్య వర్గాలను విస్మయపరుస్తోంది. ఇప్పటి వరకు గ్రామానికి చెందిన 50 మంది పైబడి డయేరియా బారిన పడినట్టు స్థానికులు చెబుతున్నారు. కొందరు ప్రభుత్వాస్పత్రులు, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టి ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నారు.

కలుషిత ఆహారమే కారణమా..?

గ్రామంలో ఇటీవల జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో కలుషిత ఆహారం తినడమే కొత్తగా డయేరియా కేసుల నమోదుకు కారణమని వైద్యాధికారులు చెబుతుండగా.. నెల రోజులుగా గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్యాంకులతో తాగునీరు సరఫరా చేస్తున్నా.. పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందంటూ విమర్శిస్తున్నారు.

పరిస్థితి అదుపులోనే ఉంది..

గ్రామంలో డయేరియా వ్యాప్తి అదుపులోనే ఉంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రతిరోజు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నాం. డయేరియాతో బాధపడుతున్న వారంతా కోలుకున్నారు. కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా ఆహార, ఆరోగ్య సూత్రాలు పాటించాలి.

– డాక్టర్ సాయిరాం, వైద్యాధికారి, సతివాడ పీహెచ్‌సీ

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి


యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్నఅర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. యాగశాలలో గత నెల 25 నుంచి గురువారం వరకు నిర్వహించిన సుందరాకాండ హవనానికి అర్చకులు పూర్ణాహుతి జరిపించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించి పుష్యమి నక్షత్రం సందర్భంగా రామాయణంలో పట్టాభిషేక సర్గ హవనం చేపట్టారు. అనంతరం పూర్ణాహుతి జరిపించి ఆస్థాన మండపం వద్ద స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

గిరిజన వర్సిటీలో రసాయన శాస్త్ర పురోగతిపై సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ అవుట్ రీజ్ ప్రోగ్రాం 'రసాయన శాస్త్రాలలో అభివృద్ధి' అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. నవంబర్ 23 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో తాజా రసాయన శాస్త్ర పరిశోధనలు, విద్యా సహకారం, విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాల అభివృద్ధి వంటి ముఖ్య అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవ సమావేశంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.నటరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో తాజా పురోగతుల ప్రాధాన్యతను వివరించారు. 'రసాయన శాస్త్ర అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలస్తంభం అని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీవీకట్టిమణి మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించడంలో విశ్వవిద్యాలయం పాత్రపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు డాక్టర్ సురేష్ బాబు కె, ప్రొఫెసర్ ఎం.శరత్ చంద్రబాబు, డాక్టర్ కిశోర్ పడాల నిర్వహించారు. కార్యక్రమం విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొదించడంతో పాటు, విద్యా మేధస్సుకు కొత్త మార్గాలను సృష్టించేందుకు తోడ్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్..: డీఎస్పీ



సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నారాయణరావుతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట నిఘా వేస్తున్నామన్నారు. రామభద్రపురం మండల కేంద్రం అంతర్రాష్ట్ర కూడలి కావడంతో నిఘా పెంచామన్నారు. జాతీయ రహదారులపై అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. వారి వెంట ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు.

– రామభద్రపురం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


పాపినాయుడు మృతదేహం

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లిలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనపై పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాజానసపాపినాయుడు(44) బుధవారం తెల్లవారుజామున తన ఇంటిలో అకస్తాత్తుగా మృతిచెందాడు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు మృతుడి సోదరుడు నాజానసూర్యనారాయణ బుదరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తన తమ్ముడు ఇంటిముందు అనుమానస్పదంగా మృతిచెంది పడి ఉన్నాడని పేర్కొన్నాడు. దీంతో బుదరాయవలస ఎస్సై జి.లోకేష్‌కుమార్ తన సిబ్బందితో పాటు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబసభ్యులను ఆరా తీయగా బుధవారం ఉదయం గ్రామానికి చెందిన ఈశ్వరరావు అనే వ్యక్తితో నాజాన పాపినాయుడికి తగాదా జరిగిందని, ఈ తగాదాయే పాపినాయుడి మృతికి కారణమై ఉండవచ్చని మృతుడి బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పాపినాయుడితో తగాదా పడిన ఈశ్వరరావును బుదరాయవలస ఎస్సై అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాపినాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, కుమార్తె యశోద, కుమారుడు జగన్ ఉన్నారు.